# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## ఆర్. నటరాజ మొదలియార్

### (విజయచిత్ర – 1971, ఫిబ్రవరి సంచిక నుంచి)




దక్షిణ భారత దేశంలో తొలిసారిగా మూకీ చిత్రం నిర్మించిన ఘనత గల మహనీయుడు ఆర్. నటరాజమొదలియార్ 1918 లో ఆయన "కీచకవధ' నిర్మించారు. ఆయన ప్రస్తుతం మద్రాసులోనే వుంటున్నారు. ఆయన జీవితసంగ్రహాన్నీ, ఆయనతో జరిపిన 'ఇంటర్వ్యూ' నూ ఇక్కడ ప్రచురిస్తున్నాము :

"రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలో ఒక భాగంగా భారతదేశం వున్న రోజుల్లో, బ్రిటిష్ వారు భారతీయుల్ని బానిసలుగా చూస్తున్న రోజుల్లో – ఒక భారతీయుడు ఒక బ్రిటిష్ వనితకు తన చిత్రంలో వేషం యిచ్చి, (ఆ వేషానికి ద్రౌపది అని పేరు పెట్టి) ఆమె వలువల్ని వూడదీయించాడంటే, ఆ భారతీయుడికి ఎన్ని గుండెలు కావాలి? ఆ భారతీయుడిని గౌరవించే భాగ్యం నాకు కలిగినందుకు నేనెంతో గర్విస్తున్నాను –"

ఆ మధ్య చిత్రసీమలోని నిష్ణాతులను సన్మానించడానికి ఏర్పాటైన ఒక సభలో తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి అన్న మాటలు ఇవి.

ఆ భారతీయుడు ఆర్. నటరాజమొదలియార్. ఆ బ్రిటిష్ వనిత 'మిసెస్ వైలెట్ బేరీ'; ఆ చిత్రం – 'ద్రౌపదీ వస్త్రాపహరణం'. అది అర్ధ శతాబ్దం క్రిందటి మాట.

1885 జనవరి 26 న వెల్లూరు (రాయవెల్లూరు) లో నీతి నిజాయితీలకు పేరు పడ్డ, వ్యాపారస్తుల కుటుంబంలో ఆర్. నటరాజమొదలియార్ జన్మించారు. తండ్రి రంగస్వామి మొదలియార్. నటరాజ మొదలియార్ మెట్రిక్యులేషన్ వరకూ చదువు అక్కడే సాగించారు. తండ్రిగారివలె తానూ వ్యాపారం చెయ్యాలని – తన పెత్తల్లి కొడుకు ధర్మలింగ మొదలియార్ తో కలిసి, మదరాస్ లో 'వాట్స్ న్ అండ్ కో' అనే వ్యాపార సంస్థ స్థాపించారు. అయిదారు సంవత్సరాలపాటు సైకిళ్ళను దిగుమతి చేసి అమ్ముతూ వుండేవారు.

ఆ తర్వాత వారు 'రోమార్ డాన్ అండ్ కో" అనే ఒక సంస్థను కొన్నారు. ఈ సంస్థ మోటార్ కార్లను దిగుమతి చేసి అమ్మేది. దక్షిణ భారత దేశంలో ఈ వ్యాపారం చేసే రెండు సంస్థల్లో ఇదీ ఒకటి. వ్యావారం బాగా సాగుతున్నది. మంచి వ్యాపారిగా నటరాజమొదలియార్ కు మంచి పేరు వచ్చింది. కాని, ఆ జీవితం ఆయన కంత నచ్చలేదు. ఏదో కొరతగానూ, నిర్జీవంగానూ కనిపించింది. స్వతహాగా ఆయనకు చిత్రాలన్నా, చిత్రకళ అన్నా అభిరుచి వుంది. ఏదైనా సృజనాత్మకమైన వ్యాపారం గాని, వృత్తి గాని చేయాలని కోరిక కలిగింది.

అప్పుడే, భారత దేశంలో తయారైన తొలి మూకీ 'రాజా హరిశ్చంద్ర' విడుదలయింది. ఆ చిత్రానికి సంబంధించిన కరపత్రాలు చూశారు. ఆ చిత్రాన్నీ చూశారు. ఆ చిత్రం ఆయన కెంతో విచిత్రంగా కనిపించింది. అలాంటి చిత్రాలు తీయాలని కోరిక పుట్టింది. కాని, చిత్రాలు తీయడం ఎలా? ఎక్కడ నేర్పుతారు? ఎవరు నేర్పుతారు? ఇవే ఆలోచనలు.

స్టూవర్ట్ అనే బ్రిటిష్ కెమెరామెన్ పూనాలో వున్నాడనీ, ఆయనకు అక్కడ ఒక సినిమాహాలు కూడా వుందనీ తెలిసింది. వైస్రాయ్ ఢిల్లీ దర్బారును చిత్రీకరించబోయే ప్రత్యేక ఛాయాగ్రాహకుడు కూడా ఆయనే అని తెలిసే సరికి, తన ఆశలు ఫలిస్తాయని నటరాజమొదలియార్ కు నమ్మకం కలిగింది. వెంటనే పూనా వెళ్ళారు. ఫోటోగ్రఫీ, ప్రాసెసింగ్, ప్రింటింగ్ మొదలైన విద్యలన్నీ స్టూవర్ట్ వద్ద అభ్యసించారు. మొదలియారే స్వయంగా కొన్ని దృశ్యాలు షూట్ చేశారు. ప్రాసెస్ చేసి, ప్రింట్ చేసి ఆయన గురువుగారి థియేటర్లోనే గురువుగారికి చూపించారు. ఫలితాలు గురువుగారికి కూడా సంతృప్తికరంగా వున్నాయి.

గురుకులవాసం పూర్తి చేసి 1915 లో నటరాజమొదలియార్ మదరాస్ తిరిగి వచ్చారు. 1917 లో 'ఇండియన్ ఫిలిం కంపెనీ' అనే సంస్థను స్థాపించారు. ఒక 'విలియమ్స్' కెమెరా, ఒక ప్రింటర్ తిరువయ్యార్ లో మూపనార్ అనే ఆయన వద్ద అమ్మకానికి వున్నాయని తెలిసింది. వెంటనే వెళ్ళి 1,800/- ఇచ్చి ఆ రెండూ కొన్నారు. ఆయనకు చేదోడుగా మరొకరు వుంటే మేలని తోచింది. ఆయన మిత్రుడు జగన్నాథ ఆచారి అనే ఆర్టిస్టును స్టూవర్ట్ వద్దకు పంపారు. ఫోటోగ్రఫీ, డెవలపింగ్, ప్రింటింగ్ వగైరాలన్నీ నేర్పించారు. ఆయన తిరిగి రాగానే చిత్ర నిర్మాణం ప్రారంభించారు. మిల్లర్స్ రోడ్ లోని ఒక బంగళా తీసుకున్నారు. ఆ కాంపౌండ్ లోనే ఒక పెద్ద షెడ్డు వేశారు. ఆ షెడ్డుకు కప్పుగా ఒక తెల్లటి గుడ్డను కప్పారు. అంచేత షూటింగుకు అవసరమయ్యే సూర్యకాంతి సెట్ లో పడుతుంది. సూర్యకాంతి తీక్షణంగా కూడా వుండదు. (ఆ రోజుల్లో) షూటింగుకు సూర్యకాంతినే తప్ప, ఈ రోజుల్లోలా లైట్లు వుపయోగించే వారు కాదు.) ఈ విధంగా మదరాసులో – మదరాసులో అనేమిటి – దక్షిణ భారత దేశంలోనే తొలి స్టూడియో వెలిసింది.

ఇక కథను సిద్ధం చేయాలి. నటీనటుల్ని ఎన్నిక చేయాలి. వారికి శిక్షణ ఇవ్వాలి. రా ఫిలింను లండన్ నుంచి దిగుమతి చేసుకోవాలి – ఇవన్నీ సమస్యలే.

నాటకరంగం పైన పేరు ప్రతిష్టలు సంపాదించిన రంగవడివేలు అనే న్యాయవాది, నటరాజ మొదలియార్ కు చేదోడుగా వుండడానికి అంగీకరించారు. తిరు వెంకటస్వామి అనే మరో న్యాయవాది స్క్రిప్టు రచనలో మొదలియార్ కు సహాయపడుతున్నారు. 'కీచకవధ' ను కథావస్తువుగా నిర్ణయించారు. కాని, కొందరు మిత్రులు – "శుభమా అని చిత్రం తీస్తూ, యిదేం కథ? దురాలోచనలూ, హత్యలూ, రక్తపాతం" అని నిరుత్సాహ పరిచారు. కాని, మొదలియార్ ఒకసారి నిర్ణయిస్తే, ఆ నిర్ణయానికి తిరుగులేదు. ఆ చిత్రం తీసి తీరాలనుకున్నారు. రాజు మొదలియార్ అనే రంగస్థల నటుణ్ణి కీచక పాత్రకూ, జీవరత్నం అనే ఆమెను సైరంధ్రి పాత్రకూ తీసుకున్నారు. ఎక్కువగా అవుట్ డోర్ లోనే చిత్రీకరణ జరిగింది. నటరాజ మొదలియారే డైరెక్టు చేశారు. ఫోటోగ్రఫీ, ప్రాసెసింగ్, ప్రింటింగ్ అన్నీ ఆయనే స్వయంగా చూసుకున్నారు. కళాదర్శకుడంటూ, ప్రత్యేకంగా లేరు. మొదలియారే – రవివర్మ పద్ధతిలో – పాత్రలకూ, సెట్స్ కూ రూపకల్పన చేశారు. షణ్ముగం అనే ఒక ఆర్టిస్టూ, స్కూల్ ఆఫ్ ఆర్ట్ లో పనిచేసే మీనన్ అనే ఆయనా ఆయనకు సహాయపడ్డారు. చిత్రం నిడివి ఆరు వేల అడుగులు మాత్రమే. కొన్ని ముఖ్యదృశ్యాలను వివరిస్తూ, చిత్రం పైన 'సబ్ టైటిల్స్' తమిళంలోనూ, హిందీలోనూ చూపించారు. తమిళ టైటిల్స్ రాయడానికి నటరాజ మొదలియార్ కు, ఆయన మేనమామ డాక్టర్ గురుస్వామి మొదలియార్, తిరువెంకటస్వామి మొదలియార్ సహాయపడ్డారు. హిందీ టైటిల్స్ దేవదాస్ గాంధీ (మహాత్మా గాంధీ కొడుకు) రాశారు.

ఆ విధంగా దక్షిణ భారత దేశంలో – తొలి చిత్రం 'కీచక వధ' నిర్మింపబడింది. నిర్మాణానికి అయిదు మాసాలు పట్టింది. 35 వేల రూపాయలు ఖర్చయింది. (ఆయన కొన్న కెమెరా, ప్రింటర్, స్టూడియో, నటీనటుల కిరాయిలు, రా ఫిలిం, సెట్స్ వగైరా ఖర్చులు అన్నీ కలిపి) 1918 వ సంవత్సరంలో మదరాస్ ఎలిఫిన్ స్టన్ (నేటి న్యూ ఎలిఫిన్ స్టన్) టాకీస్ లో ఆ చిత్రం విడుదలైంది. రెండు వారాలు ప్రదర్శింపబడింది. రోజూ రెండు ఆటలు – శని

ఆదివారాల్లో మ్యాటనీలు వుండేవి. సబ్ టైటిల్స్ వచ్చినప్పుడు హాలులో కొందరు వ్యాఖ్యాతలు – ఆయా దృశ్యాలను ప్రాంతీయ భాషల్లో విశదీకరించేవారు. ఆ తర్వాత ఆ చిత్రం భారతదేశంలో చాలా చోట్ల ప్రదర్శింపబడింది. రంగూన్, కరాచీ నగరాల్లో కూడా ప్రదర్శింపబడింది.

ఆ చిత్రం ఏభైవేల రూపాయలు వసూలు చేసింది. వచ్చిన లాభంతో మొదలియార్ కు ఉత్సాహం పెరిగింది. వెంటనే ద్వితీయ చిత్రం ప్రారంభించారు. 'ద్రౌపదీ వస్త్రాపహరణం' తీయడానికి నిర్ణయించారు. కాని – ద్రౌపది పాత్రకు భారతీయ వనితలు ఎవరూ అంగీకరించలేదు. చివరకు 'వైలెట్ బేరీ' అనే బ్రిటిష్ వనితను ఒప్పించారు. ఆమెకు తమిళం రాదు. ఆమె పక్కన నటించవలసిన దుశ్శాసనుడికి ఆంగ్లం రాదు. అంచేత ఇంగ్లీషు తెలిసిన దొరస్వామి పిళ్ళైను తీసుకున్నారు. రాజూ మొదలియార్ కూడా నటించారు. తొలి చిత్రం కన్న ఖర్చు తక్కువే అయింది. చిత్రం విడుదలయింది. 75 వేల రూపాయలు వసూలు చేసింది. 1919 వ సంవత్సరంలో విడుదలైన చిత్రాల్లో ఇదే ఘనవిజయం సాధించింది.

ఆ తర్వాత 'లవకుశ' నిర్మించారు. గోవిందస్వామి నాయుడు అనే ఆయన రాముడుగా నటించారు. ఈ సంవత్సరంలోనే ఆయన నాల్గవ చిత్రం 'రుక్మిణి – సత్యభామ' ప్రారంభించారు. జానకి అనే ఒక బ్రాహ్మణ యువతి రుక్మిణి పాత్ర ధరించింది. జీవరత్నం సత్యభామగానూ, నటేశనాయుడు కృష్ణుడుగానూ నటించారు.

ఆయన అయిదవ చిత్రం 'మార్కండేయ', సుబ్రహ్మణ్యంనాయుడు యముడుగా నటించారు. ఆ సుబ్రహ్మణ్యంనాయుడుతోనే 'మైరావణ' కూడా నిర్మించారు.

నటరాజమొదలియార్ ఆరు చిత్రాలు నిర్మించారు. అన్నీ మూకీలే – అన్నీ పౌరాణికాలే. వాటి సగటు నిడివి ఏడువేల అడుగులు. సగటు వెల పదిహేనువేలు మాత్రమే! ఒకే సెట్ ను కొద్ది మార్పులు చేసి రెండేసి చిత్రాలకు కావలసిన దృశ్యాలను ఒకేసారి షూట్ చేసేవారు. 'రుక్మిణి – సత్యభామ' చిత్రాన్ని నెల రోజుల్లోనే పూర్తి చేశారు.

'నటీనటులకు నెలజీతాలే యిచ్చేవాణ్ణి. ఏభైకి తక్కువ కాకుండానూ 150కి మించకుండానూ వారి జీతాలు వుండేవి. అంతా రిక్షాలోనే స్టూడియోకి వచ్చేవారు. అందరిచేతా క్షుణ్ణంగా రిహార్సల్స్ చేయించేవాళ్ళం. ఆ రోజులు వేరు. ఆ రోజుల్లో సినిమాలో నటించడానికి స్త్రీలు ముందుకు వచ్చేవారు కారు. వాళ్ళను ఒప్పించాలంటే చాలా కష్టంగా వుండేది. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ టాకీలకన్న మూకీలు తీయడమే కష్టం. చెప్పదల్చుకున్నది ఒక్క మాటలో చెప్పవచ్చు. కాని, మాటను భావంలో చూపాలి. అదేకదా నటనకు గీటురాయి. ఆ రోజుల్లో ప్రచారం కూడా చాలా నిరాడంబరంగా వుండేది. వాల్ పోస్టర్లు, కరపత్రాలే మాకు సాధనాలుగా వుండేవి. కథావస్తువును మాత్రమే ఎక్కువగా ప్రచారం చేసేవాళ్ళం –" అన్నారు నటరాజ మొదలియార్ గతాన్నంతా ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటూ, ప్రస్తుతాన్ని గురించి మాట్లాడుతూ – " టెక్నిక్ చాలా పెరిగింది. ఎన్నో సౌకర్యాలు వచ్చాయి. పరిశ్రమ చాలా వృద్ధి చెందింది. పరిశ్రమకూ, పరిశ్రమలోని వారికి గౌరవం పెరిగింది. ప్రభుత్వం కూడా గుర్తించింది. కాని, గత పదేళ్ళుగా నేను ఏ చిత్రమూ చూడలేదు. నా వృద్ధాప్యం మూలంగా ఎక్కడకూ కదలలేకపోతున్నాను. కాని, వార్తా పత్రికల్లోని వార్తలూ, రోడ్డు పక్కన వున్న పెద్ద పెద్ద బోర్డులూ చూస్తుంటే నేటి సినిమా పురోగతి అర్థమవుతుంది." అన్నారు.

"తొలి మూకీ తీసిన మీరు, తొలి టాకీ ఎందుకు తీయలేదు?" అన్న ప్రశ్నకు సమాధానం ఇస్తూ –

"అదే విధి అంటే, నేను నమ్మినవాళ్ళు నన్ను నమ్మలేదు. క్రమశిక్షణ తగ్గింది. స్వార్థం పెరిగింది. నన్ను అనేక రకాలుగా యిబ్బంది పెట్టారు. వీటిన్నిటినీ మించి, నేను సినిమాలు తీయడం ఆ భగవంతుడికే ఇష్టం లేదేమో! – లేకపోతే, నా స్టూడియో కాలిపోతుందా? నా చేతికి అందివచ్చిన ఒక్కగానొక్క కొడుకూ నాకు దూరమవుతాడా ? అందుకే నేను పరిశ్రమకు దూరమైపోయాను." అన్నారు – 85 ఏళ్ళ వయోవృద్ధు నటరాజ మొదలియార్.

COMMENTS